సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం, 10, జూన్, 2024



అతి వినియోగం అనర్థం..
యాంటీ బయాటిక్స్ మందులను జనం అధికంగా మింగేస్తున్నారు. జిల్లాలో వీటి వినియోగం బాగా పెరిగింది.
- 2లో



జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ
ఐఐటీ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్- 2024 ప్రవేశ పరీక్షలో జిల్లా విద్యార్థులు మంచి ర్యాంక్‌లు సాధించారు.
- 2లో



వేడుకగా సీతారాముల కల్యాణం
విజయనగరం మండలంలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు.
- 2లో

న్యూస్‌రీల్

దొంగల బీభత్సం

- 25 తులాల బంగారం, నగదు చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న ఎస్సై యు.మహేష్

గజపతినగరం: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై అగ్నిమాపక శాఖ కార్యాలయం సమీపంలో నివాసంలో ఉంటున్న ఓఇంట్లో దొంగలు చొరబడి బంగారం, నగదు అపహరించారు. శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. బుడ్డెపు తిరుపతి రావు అనే వక్తి ఇటీవల కుటుంబంతో తీర్థయాత్రలకు వెళ్లాడు. ఇంటి బాధ్యతలను వరుసకు మేనమామ అయిన నాగరాజుకు అప్పగించాడు. ఈ క్రమంలో నాగరాజు తన పనులు ముగించుకుని తిరుపతి రావు ఇంటిని చూసేందుకు వచ్చిన సమయంలో తలుపులు పగలగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి తిరుపతిరావుకు వెంటనే సమాచారం అందించాడు. దీంతో బాధితుడు హుటాహుటిని ఇంటికి వచ్చి పరిశీలించి సుమారు 25తులాల బంగారం, లక్ష రూపాయల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై యు.మహేష్ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌పై గడ్డి దగ్ధం



ట్రాక్టర్‌లో మంటలు అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్ అవడంతో ట్రాక్టర్‌లో ఉన్న గడ్డి అగ్నికి అహుతైంది. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది ఎస్.ఎఫ్ మదీనా, ఎల్.ఎఫ్ ఆర్.వెంకటరావు, ఫైర్‌మెన్ ఎస్.వెంకటేశ్వరావు, జిరాము తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేయడం వల్ల ప్రమాదం తప్పింది. అగ్ని ప్రమాదాన్ని గుర్తించిన ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంగా ఖాళీస్థలంలో ట్రాక్టర్‌ను నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పినందుకు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



వెండి మంటపం వద్ద పట్టాభిషేక మహోత్సవం జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో సుందరాకాండ హవనం జరిపించారు. అనంతరం వెండి మంటపంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



క్రికెట్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన పీస్ ఎటాకర్స్ జట్టుతో ఎస్సై సూర్యకుమారి

భోగాపురం: యువత అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎస్సై సూర్యకుమారి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఎస్సై సూర్యకుమారి ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీల్లో గెలుపొందిన ప్రథమ జట్టు విజేతలకు రూ.25 వేలు, ద్వితీయ జట్టు విజేతలకు రూ.15 వేలు నగదు అందజేశారు. అదేవిధంగా బ్యాటింగ్‌లో అత్యధిక పరుగులు సాధించిన చిన్నికి మ్యాన్ ఆఫ్ ది సిరీస్, అత్యధిక వికెట్లు తీసిన అశోక్‌కు ప్రత్యేక బహుమతులు అందజేశారు. మ్యాచ్‌ల నిర్వాహకులను ఆమె అభినందించారు.

దయచేసి వినండి



- తల్లిదండ్రులకు గమనిక
- ప్రైవేట్ స్కూల్స్‌పై ఓ కన్నేయండి
- అన్నీ వాకబు చేశాక పిల్లలను చేర్పించాలి
- ఆకర్షణీయ ప్రచారాలు నమ్మి మోసపోవద్దు
- రిజిస్ట్రేషన్, గుర్తింపుపై ఆరా తీయాలి

మేడిపండు చూడ మేలిమైనుండు..పొట్ట విప్పి చూడ..అన్న చందాన ఆకర్షణీయ ప్రకటనలు, ఆకట్టుకునే ఆఫర్లు చూసి మోసపోవద్దని పలువురు విద్యావేత్తలు, విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. మరికొన్ని రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో తమ పిల్లలను చేర్చాలనుకునే తల్లిదండ్రులు సదరు పాఠశాల ప్రభుత్వ గుర్తింపు పొందిందా? లేనిదీ ముఖ్యంగా గమనించాలని, ఆ తరువాత పాఠశాలలో ఉన్న సదుపాయాలు, బోధన సిబ్బంది తదితర వివరాలు పరిశీలించిన తరువాతనే ముందుకు వెళ్లాలని హితవు పలుకుతున్నారు.

విజయనగరం అర్బన్:

నూతన విద్యా సంవత్సరం మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. విజయనగరం జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను నూతన బ్రాంచిల పేరిట ఆయా ప్రాంతాల్లో ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు హంగులూ, ఆర్భాటాలతో తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ప్రచారాలు చేస్తూ ప్రవేశాల ప్రక్రియ చేపడుతున్నారు.

ప్రభుత్వం అనుమతిలేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయి. చైల్డ్ ఇన్ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతిపత్రాలు, బదిలీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతి లేని స్కూల్స్‌లో ఈ నమోదు ఉండదు. ఆయా విద్యార్థులను బడిబయట ఉన్నవారిగానే పేర్కొంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త ప్రైవేట్ పాఠశాల ప్రారంభించాలంటే విద్యాశాఖ అనుమతి తీసుకోవాలి. మొదటి ఓపెనింగ్ అనుమతి తీసుకున్న తర్వాతే విద్యా సంస్థలను తెరిచి విద్యార్థులను చేర్చుకోవాలి. తర్వాత పూర్తి స్థాయి అనుమతి పొందాలి. ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషన్ అనుమతి తీసుకోవాలి. సీబీఎస్‌ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యామండలి సమ్మతించాలి.



ప్రైవేట్ స్కూల్స్‌లో ప్రవేశాల్లో విద్యార్థులు

గుర్తింపు పొందిన స్కూల్స్ 431

జిల్లాలోని 27 మండలాల పరిధిలో ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు 431 ఉన్నాయి. వాటిలో సీబీఎస్‌సీ, స్టేట్ సిలబస్ ఉన్న ప్రాథమిక పాఠశాలు 127, ప్రాథమికోన్నత పాఠశాలలు 149, ఉన్నత పాఠశాలలు 155 ఉన్నాయి. దాదాపు 90 వేల మంది విద్యార్థులు అన్ని తరగతుల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఈ ఏడాది నూతనంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థలేవీ లేవు.

విద్యాసంస్థపై ఆరా తీయాల్సిన అంశాలు

ప్రతి విద్యా సంస్థ ప్రభుత్వం నుంచి కచ్చితంగా గుర్తింపుపొంది ఉండాలి. ఇది నిబంధన. గుర్తింపు పొందిన విద్యాసంస్థలలోనే తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొన్ని పాఠశాలలు ఇతర విద్యా సంస్థల తరపున పరీక్షలు రాయిస్తుంటాయి. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రైవేట్ విద్యార్థిగానే ప్రభుత్వం పరిగణిస్తుంది. ఇలాంటి విషయాల్లో జాగ్రత్త అవసరం.

తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

ప్రైవేట్ విద్యాసంస్థల్లో పిల్లలను చేర్చాలనుకునే తల్లిదండ్రులు ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి మోసపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తెలుసుకోవాల ప్రధానమైన కొన్ని అంశాలు ఇలా ఉన్నాయి.

- చేరాల్సిన పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా? లేదా? అనేది తొలుత చూసుకోవాలి. పాఠశాల భవనం నాణ్యతపై ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించాలి.
- జి-1 భవనాలు ఉంటే అగ్నిమాపక పరికరాలు, ఆ స్థాయి దాటితే మంటలు ఆర్పే పూర్తి స్థాయి వ్యవస్థ ఉండాలి. సంబంధిత విభాగం నుంచి అనుమతి ఉండాలి.
- బాత్ రూములు, మరుగుదొడ్లు, నీటి సదుపాయం తదితర మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా చూసుకోవాలి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో 20 నుంచి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ఉన్నత పాఠశాల అయితే సబ్జెక్టుల వారీగా ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు ఉండాలి.
- విద్యార్థుల మానసిక, శారీరకోల్లాసానికి ఉపకరించే క్రీడా ప్రాంగణం, అనుగుణంగా క్రీడా ఉపాధ్యాయులు ఉన్నారా లేదా ఆరా తీయాలి.
- అన్ని సబ్జెక్టులకు అర్హత గల ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారా లేదా అన్న విషయం పరిశీలించాలి.

అన్నదాతకు ఆదర్శం

- సొంతంగా విత్తనాల తయారీ
- ఏపీ సీడ్స్‌కు అందజేత
- విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన



ఏపీ సీడ్స్‌కు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏపీసీడ్స్ అంటే ప్రతి రైతుకు ఎంతో ఇష్టం. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులు ఈ విత్తనాల కోసం బారులు తీరుతుంటారు. అటువంటి ఏపీ సీడ్స్‌కు గత 25 సంవత్సరాలుగా రేగిడి మండలం నుంచే విత్తనాలు వెళ్తున్నాయి. అవి కూడా ఒక రాజకీయ కుటుంబానికి చెందిన నేత సొంతంగా వ్యవసాయం చేస్తూ విత్తనాలు తయారు చేసి అందించడం విశేషం. ఏపీ సీడ్స్‌కు విత్తనాలు అందించడమే కాకుండా తమ గ్రామ పరిసర ప్రాంతాల రైతులకు కూడా విత్తనాలు అందిస్తున్న ఆ వ్యక్తి మరెవరో కాదు రేగిడి మండలంలోని ఉణుకూరు గ్రామానికి గేదెల వెంకటేశ్వరరావు.

-రేగిడి

ఉణకూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు ప్రస్తుతం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా ఉన్నారు. ఆయన తండ్రి రాజగోపాలరావు ఉన్నప్పటి నుంచే ఆ కుటుంబానికి వ్యవసాయం అంటే మక్కువ. రాజకీయ నేపథ్యం ఉన్న ఆయన ఓ వైపు రాజకీయ నేతగా ఉంటూ మరో వైపు వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. 50 ఎకరాల తన పొలంలో నిత్యం పంటలు పండించడమే కాకుండా ఎటువంటి రసాయన ఎరువులు వినియోగించకుండా సేద్యం చేస్తూ సాంబమసూరి, సోనామసూరి, బీపీటీ 5204, ఎంటీయూ 1121 తదితర రకాల పంటలు పండిస్తున్నారు. వాటి నుంచి వచ్చిన ధాన్యాన్ని గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా విత్తనాలుగా తయారు చేసి ఏపీ సీడ్స్‌కు అందిస్తున్నారు. ఆయన పంపిన విత్తనాల్లో నాణ్యత ఉండడంతో అధికారులు కూడా ఏటా విత్తనాలు పంపించమని ఆయనను కోరుతుండడం విశేషం. ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా తాను తయారుచేసిన ఎంటీయూ 1121 రకం 1500క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 1500 క్వింటాళ్ల విత్తనాలను ఏపీ సీడ్స్‌కు వెంకటేశ్వర రావు పంపించారు. ఖరీఫ్‌లో ఎక్కువగా బీపీటీ 5204 విత్తనాలకు డిమాండ్ ఉంటుంది.

విత్తనాల తయారీ ఇలా..

విత్తనాలు తయారీ చేయాలనుకునే పొలానికి సంబంధించి జాగ్రత్తగా సేంద్రియ ఎరువులు సిద్ధం చేస్తారు. ఖరీఫ్,రబీలో పండిన పంటలో కేలీలు లేకుండా చూసుకుంటారు. పంట చేతికందగానే జాగ్రత్తగా బల్లకొట్టు విధానంతో ధాన్యం తీసి విత్తనాలు కడతారు. విత్తనాలు బాగా వచ్చిన తరువాత రసాయన మందులతో విత్తనాలు పాడవకుండా ఏర్పాట్లు చేసుకుంటారు.

ఆదర్శంగా ..

ఓ వైపు రాజకీయ నేపథ్యం ఉండడంతో పాటు ఉన్నతమైన వ్యక్తిత్వం గల నాయకుడిగా వెంకటేశ్వర రావు మంచి పేరు సంపాదించారు. వ్యవసాయంపై మక్కువతో తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన భూమిలో సేద్యం చేస్తూ పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. డ్రమ్ సీడర్, క్రాప్ కట్టర్ వంటి అధునాతన యంత్ర సామగ్రిని ఆయన వినియోగిస్తూ నాణ్యమైన పంటలు పండించి రైతులకు ఆదర్శంగా ఉండడంతో పాటు విత్తనాలు కూడా తన పరిసర గ్రామాల రైతులకు అందిస్తున్నారు.

రైతులు ముందుకు రావాలి



రైతులు సొంతంగా విత్తనాలు తయారు చేసుకోవడం అలవాటు చేసుకోవాలి. విత్తనోత్పత్తి పథకం చాలా మంచిది. ఖరీఫ్‌లో కొంత పొలాన్ని సిద్ధం చేసి, అందులో పండించిన పంటను జాగ్రత్తగా నూర్పు చేసి, ధాన్యం ముక్క కాకుండా చూసుకుంటే మంచి విత్తనం వస్తుంది. ఈ విత్తనాన్ని వినియోగించుకుంటే పంట దిగుబడి బాగా రావడంతో పాటు విత్తనాల కోసం ఎదురుచూడాల్సిన అవసరం ఉండదు. వ్యవసాయం చేసే రైతులు ఈ విధానానికి ముందుకురావాలి.

- గేదెల వెంకటేశ్వరరావు, ఆదర్శ రైతు, ఉణుకూరు

శాస్త్రవేత్తల ఆదేశాలతో పంట సాగు

ఉణుకూరుకు చెందిన వెంకటేశ్వరరావు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు ఆదేశాలతో పండిస్తుంటారు. అందుకే మంచి దిగుబడి రావడంతో పాటు నాణ్యత బాగుంటుంది. పంటలతో పాటు విత్తనాలు కూడా నాణ్యంగా ఉండడంతో వాటిని ఏపీ సీడ్స్‌కు వినియోగిస్తున్నాం. ప్రభుత్వం అందించిన వరి విత్తనాల కిట్లు కూడా అందజేస్తున్నాం.

-జి.మురళీకృష్ణ, ఏఓ, రేగిడి మండలం



వెంకటేశ్వరరావు పండించిన పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు

‘ఆశ్రమాల్లో’ అడ్మిషన్లు

- విద్యార్థుల ప్రవేశాలపై ప్రధానోపాధ్యాయుల ఫోకస్
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు
- ఇప్పటికే కౌన్సెలింగ్ పూర్తి
- డ్రాపౌట్లు లేకుండా విద్యాశాఖాధికారుల చర్యలు



మల్లి పీవీటీజీ పాఠశాలలో లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తున్న అధికారులు

సీతంపేట: కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా సర్కారీ పాఠశాలలను తీర్చిదిద్దడంతో ప్రవేశాలకు విద్యార్థులు ఎగబడుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే పిల్లల భవిష్యత్ బాగుంటుందని యోచించి మొగ్గుచూపుతున్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులు గిరిజన విద్యా సంస్థల్లో చేరడానికి ఎక్కువగా ఇష్టపడతారు. ఇక్కడైతే అన్నిరకాల మౌలికవసతులు, విద్యతో పాటు ఉచిత వసతి, భోజన, వైద్య సదుపాయాలను కల్పిస్తారు. ప్రత్యేక మెనూ అమలు చేస్తారు. ఆంగ్ల మాధ్యమం బోధనతో పాటు అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉండడంతో చక్కనైన చదువు అందుతుందని వారి అభిప్రాయం. పదోతరగతిలో కూడా గడిచిన రెండేళ్లగా పార్వతీపురం మన్యం జిల్లా 96 శాతం ఫలితాలు సాధిస్తుండడంతో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సీట్లకు డిమాండ్ ఏర్పడింది.

ఇదీ పరిస్థితి..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 47 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, 8 గిరిజన గురుకులాలు, 2 మినీ గురుకులాలు నిర్వహిస్తున్నారు. 226 గిరిజన ప్రైమరీ పాఠశాలలు నిర్వహణలో ఉన్నాయి. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో 18,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇటీవల కాలంలో 2 వేల మంది వరకు విద్యార్థులు చేరారు. ఇంకా అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతోంది. సీతంపేట, హడ్డుబంగి, పూతికవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో సీట్లు కావాలని ఎక్కువగా వస్తున్నారు. మల్లి, దోనుబాయి, సీతంపేట ఆశ్రమపాఠశాలల్లో బాలురు ఎక్కువగా చేరుతున్నారు. భామిని, వీరఘట్టం, పాలకొండ, భద్రగిరి, జీఎల్‌పురం, పి.కోనవలస తదితర మండలాల్లో ఉన్న పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇప్పటికే గిరిజన సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలకు ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించి, ప్రతిభ ఉన్నవారిని చేర్చుకున్నారు. మల్లిలో ఉన్న ఏకైక పీవీటీజీ (పర్టికులర్లీ వల్నరబుల్ ట్రైబ్ గ్రూప్) గురుకులంలో లాటరీ ద్వారా మూడో తరగతిలో 80 సీట్లు భర్తీ చేశారు. సీతంపేట, కొత్తూరు మినీగురుకులాల్లో లాటరీ ద్వారా 105 సీట్లు భర్తీ చేశారు. ఇలా చాలా పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయింది. అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న ప్రీస్కూల్స్‌లో 3-6 సంవత్సరాల వయసు ఉన్న వారు వేలాది మంది ఉన్నారు. వారిలో ఐదేళ్లు పైబడిన వారు వేల సంఖ్యలో ఉన్నారు. ఐదు సంవత్సరాల వయసు నిండిన వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు దృష్టి పెట్టారు. జిల్లాలో 220 గిరిజన ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి.



హడ్డుబంగి ఆశ్రమపాఠశాలలో విద్యార్థినులను చేర్చుకుని అడ్మిషన్ పత్రం ఇస్తున్న హెచ్ఎం ఉమావాణి

నాణ్యమైన విద్య అందిస్తున్నాం



గిరిజన విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య లభిస్తోంది. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారు. సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. మెనూతో రాజీ పడే ప్రసక్తి లేదు. పూర్తిస్థాయిలో మౌలికవసతులు కల్పించాం. అత్యాధునిక బోధన పద్ధతులు అవలంబిస్తున్నాం.

- అన్నదొర, గిరిజన సంక్షేమశాఖ డీడీ, సీతంపేట

మా పాప బాగానే చదువుతుంది



స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో మా కుమార్తె స్వాతి 8వ తరగతి చదువుతోంది. ఐదేళ్లుగా పైసా పెట్టుబడి లేకుండా చదువుతోంది. ఇక్కడ అన్ని సదుపాయాలు ఉన్నాయి. చదువులు బాగానే చెబుతున్నారు.

- ఎస్.జ్యోతి, విద్యార్థిని తల్లి, రాజన్నగూడ

ఫణి మాధవికి రాధేయ పురస్కారం

విజయనగరం టౌన్: ప్రముఖ కవయిత్రి తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాకు చెందిన ఫణి మాధవికి డాక్టర్ రాధేయ కవితా పురస్కారాన్ని స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఆదివారం రాత్రి అందజేశారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత 15 ఏళ్లుగా ఈ పురస్కారాన్ని రాజయ్య శిష్యులైన డాక్టర్ సుంక గోపాల్ పెళ్లూరు, సునీల్ దోర్నాధుల సిద్ధార్థలు అందజేస్తున్నారని, ఈ ఏడాది సభను విజయనగరంలో ఏర్పాటుచేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు ప్రస్తుత సాహిత్యం, పురోగతిపై ప్రసంగించారు.అవార్డు గ్రహీత మాట్లాడుతూ విద్యల నగరంలో అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. కళింగ ఆంధ్ర కవులు, రచయితలు పాల్గొన్నారు.



ఫణి మాధవికి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

క్లుప్తంగా

జూదరుల అరెస్ట్

పార్వతీపురం టౌన్: మండలంలోని లక్ష్మీనారాయణ గ్రామ సమీపంలో పేకాటాడుతున్న ఏడుగురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్సై దినకర్ తెలిపారు. నిందితుల నుంచి 1,20,535 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో సంఘటనా స్థలంలో మృతి చెందిన రామ్‌కుమార్



రామ్‌కుమార్ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం పంచాయతీ నవభారత్ వద్ద గల జాతీయ రహదారి ఫ్లై ఓవర్ వంతెనపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పిన్నింటి రామ్‌కుమార్ (31) దుర్మరణం చెందాడు. యువకుడు శ్రీకాకుళంలో డీటీహెచ్ కేబుల్ నెట్‌వర్క్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామం లావేరు మండలం వెంకటరావుపేట. శ్రీకాకుళం పట్టణం నుంచి స్వగ్రామానికి రోజూ బైక్‌పై వెళ్లి వస్తుంటాడు. శనివారం రాత్రి కూడా శ్రీకాకుళంలో పని ముగించుకొని స్వగ్రామం వస్తుండగా, నవభారత్ సమీపంలో ఫ్లై ఓవర్‌పై ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే ఊపిరి వదిలేశాడు. రాత్రి యువకుడు ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ప్రమాదం వార్త తెలిసి కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. మృతుడు అవివాహితుడు. తండ్రి పిన్నింటి అప్పారావు ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జాతీయ రహదారిపై ఆగి ఉన్న వాహనాలు ప్రమాదాలకు తరచూ కారణమవుతున్నాయి.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి



రమేష్ పాణిగ్రాహి మృతదేహం

కాశీబుగ్గ: పలాస మండలం కేదారిపురం పంచాయతీ కంబిరిగాం జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. కాశీబుగ్గ పోలీసుల వివరాలు ప్రకారం.. సోంపేట మండలం బారువ గ్రామానికి చెందిన రమేష్ పాణిగ్రహీ లక్ష్మీపురం టోల్‌గేటు వైపు నుంచి పలాస వైపు తన బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయారు. తల వెనుక భాగం రోడ్డుకు బలంగా తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచిపెట్టాడు. ప్రమాదంపై కాశీబుగ్గ ఎస్‌ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీ

కాశీబుగ్గ: పలాస మండలం గరుడఖండి గ్రామం పెద్దవీధిలో పల్సర్ బైకు చోరీ చేశారు. గ్రామానికి చెందిన రోణంకి శశికుమార్ తన బంధువుల నుంచి తెచ్చుకున్న బైక్‌ను హ్యాండిల్ లాక్ వేసి ఇంటి ముందు ఉంచాడు. శుక్రవారం వేకువజామున మూడున్నర గంటలకు దుండగులు హ్యాండిల్ లాక్ కూడా తీసి బండిని తీసుకెళ్లిపోయారు. సీసీ పుటేజీలో ఇద్దరు వ్యక్తులు బైక్‌ను దొంగిలించినట్లు కనిపించింది. ఈ ఆధారాలను ఆదివారం వారు కాశీబుగ్గ పోలీసులకు అందజేశారు. కాశీబుగ్గ సీఐ విజయానంద జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని లింగాలవలస గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతపట్నం మండలం సీతారాంపల్లి గ్రామానికి చెందిన పాలవలస శంకర్ అనే వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శంకర్ తన ద్విచక్రవాహనంపై టెక్కలి వచ్చి తిరిగి తమ గ్రామం వైపు వెళ్తుండగా లింగలవలస గ్రామ సమీపంలో అతని ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో శంకర్‌కి తీవ్రగాయాలు కావడంతో సమాచారం అందుకున్న 108 సిబ్బంది అతనికి ప్రథమ చికిత్స చేసి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270

అతి వినియోగం అనర్థం..

- జిల్లాలో యాంటీబయాటిక్స్ వాడకం అధికం
- జలుబు, దగ్గు వంటి వాటికి కూడా ఇవే మాత్రలు..
- కిడ్నీ ,లివర్ వ్యాధుల బారిన పడుతున్న జనం



యాంటీ బయాటిక్స్ మందులు

విజయనగరం ఫోర్ట్ : యాంటీ బయాటిక్స్ మందులను జనం అధికంగా మింగేస్తున్నారు. జిల్లాలో వీటి వినియోగం బాగా పెరిగింది. చిన్నపాటి జలుబు, దగ్గు వంటి వాటికి కూడా ప్రజలు యాంటీబయాటిక్స్ వాడుతున్నారు. కొంతమంది ఆర్‌ఎంపీలు చీటికి, మాటికీ యాంటిబయాటిక్స్ ఇవ్వడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు కిడ్నీ, లివర్ వంటి వ్యాధుల బారిన పడతున్నారు. యాంటీ బయాటిక్స్ అధిక మోతాదులో వాడడం వల్ల బ్యాక్టీరియాలు సైతం ఆ మందులకు అలవాటు పడి.. జబ్బులు తగ్గడం లేదు. దీంతో రోగులు రోజుల తరబడి మంచం పట్టాల్సి వస్తోంది. వీటి వల్ల శరీరంలో సహజసిద్ధంగా ఉండే రోగ నిరోధక శక్తి దెబ్బతింటోంది. యాంటీ బయాటిక్స్ అధిక వినియోగంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

చిన్న రోగాలకు కూడా..

పట్టణం, పల్లె అనే తేడా లేకుండా యాంటీబయాటిక్స్ మందులు అధికంగా వినియోగిస్తున్నారు. కొంతమంది ఆర్‌ఎంపీల వద్ద తీసుకోగా , మరి కొంతమంది మందుల దుకాణాల వద్ద నేరుగా తెచ్చుకుని వాడుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి, నడుంనొప్పి, చర్మ వ్యాధులు ఇలా ఏ జబ్బుకైనా యాంటీబయాటిక్స్ తెగ వాడేస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంది. కాని చాలా మంది సొంత వైద్యం చేసుకుంటున్నారు. దీంతో కిడ్నీ, కాలేయ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు.

జిల్లాలో 1200 మందుల దుకాణాలు

జిల్లాలో సుమారు 1200 మందుల దుకాణాలున్నాయి. ఏడాదికి సుమారు 50 లక్షలకు పైగా యాంటీబయాటిక్స్ మాత్రలను జనం వాడుతున్నారు. వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండానే దుకాణదారులు మందులు విక్రయించేస్తున్నారు. ప్రిస్కిప్షన్ లేకుండా మందులు అమ్మకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ ఎక్కడా అమలు కావడం లేదు.

అధిక వినియోగం తగదు..



నొప్పి నివారణ మందులు ఎక్కువగా వాడితే ప్రమాదమే. ఫ్లోరోసిస్ వల్ల నొప్పులు ఎక్కువగా ఉంటాయి. నొప్పి నివారణకు వాడే మందుల వల్ల కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంది. అదేవిధంగా కొన్ని రకాల యాంటీబయాటిక్స్ ఎక్కువగా వాడడం వల్ల కిడ్నీలు పాడయ్యే అవకాశం ఉంది. కొన్ని రకాల ఇంజక్షన్లు కిడ్నీలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వైద్యుని సలహా లేకుండా ఎటువంటి యాంటిబయాటిక్స్ వాడకూడదు.

– డాక్టర్ జి. మురళీకృష్ణ, ఎన్‌సీడీ విభాగం వైద్యాధికారి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

ఘాట్ రోడ్డుపై ఆటో బోల్తా

- పలువురికి గాయాలు



బోల్తా పడిన ఆటో



సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పెదఖర్జ మలుపులో ప్రయాణికులతో వస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని లుంబేసు పంచాయతీ లప్పటి గ్రామనికి చెందిన పలువురు గోరటి గ్రామంలో శనివారం జరిగిన శుభకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వస్తుండగా గోరటి ఘాట్‌రోడ్డుపై ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చంద్రయ్య, అర్చన, సనారమ్మ, చెల్లమ్మ, లక్ష్మమ్మ, సన్యాసి, గుంజారావు, గౌరి, సోమయ్య, సుందరరావు, సునీత, మాధవరావు, అవనిక, కళావతిలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను తాడికొండ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు చికిత్స అందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పోస్టుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎన్. ప్రేమ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య సంస్థల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ బాధ్యతలు నిర్వహిస్తున్న వారు అర్హులని పేర్కొన్నారు. నియామకం పొందిన వారు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శిగా రెండేళ్ల పాటు కొనసాగుతారన్నారు. రెండు సంవత్సరాల కాల వ్యవధిలో పదవీ విరమణ పొందేందుకు సిద్ధంగా ఉన్న ఉపాధ్యాయులు అనర్హులని తెలిపారు. అలాగే గతంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా పనిచేసి ఉండకూడదని, సీసీఏ నిబంధనల ప్రకారం ఎటువంటి క్రమశిక్షణా చర్యలు ఉండకూడదన్నారు. అర్హత, ఆసక్తి గల వ్యాయామ ఉపాధ్యాయులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉప విద్యాశాఖ అధికారి కౌంటర్ సైన్‌తో కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

పేరు	ఊరు	రిజర్వేషన్ ర్యాంక్	జాతీయ ర్యాంక్
మజ్జి రిషివర్ధన్	పోరాం	04(ఓబీసీ కేటగిరీ)	59
ధనుకొండ శ్రీనిధి	విజయనగరం	43	326
బంకురు భరత్‌కుమార్	గజపతినగరం	74	516
అల్లు హేమంత్	విజయనగరం	75	521
పువ్వల రేవంత్ సాయి	మెట్టవలస	77	535
మరడాన భానుప్రకాశ్	పార్వతీపురం	96	703
దాకి మాధవరావు	గజపతినగరం	130	889
యూ.ఆర్యవర్ధన్ నాయుడు	పార్వతీపురం	146	962
పిల్లా సృజన్‌నారాయణ	విజయనగరం	152	996
బక్కు కావ్య	బక్కుపేట	255	1618
రాగాల అఖిల్	చీపురుపల్లి	211	1343
సతివాడ కార్తీక్	రాజాం డోలపేట	161	1056
కనకల జశ్వంత్‌కుమార్	పురిటిపెంట	104	729
బి. గణేష్‌కుమార్	పురిటిపెంట	--	1503
పొట్ల నిశ్వంత్	గజపతినగరం	--	122
దేవుబార్కి రేవంత్ ఈశ్వర్	కన్నంపేట	37(ఎస్సీ కేటగిరీ)	1988
దేవుబార్కి పుష్యమిత్ర	బొబ్బిలి	151	6389
పి.ఉపేంద్ర	--	1256(ఎస్టీ కేటగిరీ)	--
ఎ.ప్రశాంత్	--	1441	--
బి.మంగయ్య	--	1516	--
ఎస్.శ్రీజ	--	3526	--



మజ్జి రిషివర్ధన్



ధనుకొండ శ్రీనిధి



అల్లు హేమంత్



మరదాన భానుప్రకాశ్



బి.భరత్‌కుమార్



డి.మాధవరావు



కనకల జశ్వంత్



రాగాల అఖిల్



సతివాడ కార్తీక్.



బి.గణేష్ కుమార్



పొట్ల నిశ్వంత్

విజయనగరం అర్బన్: దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ – 2024 ప్రవేశ పరీక్షలో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు మంచి ర్యాంక్‌లు సాధించారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన ఎం.సాయిశివాలోచన్‌కు జాతీయ స్థాయిలో 165 ర్యాంక్, పట్టణంలోని పూల్‌బాగ్ కాలనీకి చెందిన ధనుకొండ శ్రీనిధికి జాతీయ స్థాయిలో 326, పట్టణంలోని కంటోన్మెంట్‌కు చెందిన కోరాడ జయవర్ధన్‌కు జాతీయ స్థాయిలో 879 ర్యాంక్ లభించాయి. అలాగే సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో నిర్వహిస్తున్న ఐఐటీ సూపర్ 60 కోచింగ్‌లో నలుగురు గిరిజన విద్యార్థులకు ఎస్టీ కేటగిరీలో మంచి ర్యాంకులు వచ్చాయి.

ఆదిత్యుని సన్నిధిలో భక్తుల రద్దీ



ఆదిత్యుని ఆలయంలో సూర్యనమస్కారాలు చేస్తున్న అర్చకుడు



ఆదిత్యుని సన్నిధిలో జిల్లా ఎస్పీ జీఆర్.రాధిక దంపతులు



అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ చంద్రశేఖర్, శంకరశర్మ తదితరులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామిని భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. స్వామికి ఇష్టమైన రోజు కావడంతో ఇతర జిల్లాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల చర్యలను ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ చేపట్టారు. ప్రత్యేక అలంకరణతో స్వామి వారి దర్శనానికై అంతరాలయంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. భక్తులు ప్రత్యేక, విశిష్ట దర్శన మార్గాల స్వామిని దర్శించుకున్నారు. భక్తులు కేశ ఖండన శాలలో తల నీలాల మొక్కులు చెల్లించుకోగా ఆరోగ్యం కోసం సూర్య నమస్కారాల పూజలు చేయించుకున్నారు. ఒక్క రోజులో వివిధ దర్శనాల టికెట్ల ద్వారా రూ.6,09,300, పూజలు విరాళాల రూపంలో రూ.95,201, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ 2.72 లక్షల మేరకు ఆదాయం లభించినట్లు ఈఓ చంద్రశేఖర్ వెల్లడించారు. అలాగే ఎస్పీ జీఆర్ రాధిక కుటుంబ సమేతంగా దర్శించుకోగా, అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ కుటుంబ సమేతంగా ఆదిత్యుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట వన్‌టౌన్ సీఐ ఎల్.ఎస్.నాయుడు తదితరులు ఉన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో కాకినాడ ఎస్పీ

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుని కాకినాడ జిల్లా ఎస్పీ మురళీ దంపతులు సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు నిర్వహించి వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం గోలెం మొక్కులు మొక్కి కానుకలు సమర్పించారు. ఎస్పీ దంపతులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించి పుణ్యాహవచనాలతో దీవించారు. ఈ వారంలో వరుసగా సెలవులు రావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండలంలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు చాణక్య, జీఎస్ హర్ష ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్వామివారికి స్నపనం, పంచామృతాభిషేకాలు, సహస్రనామ కుంకుమార్చన చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, పద్మశ్రీ, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఏవీ రమణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై లిఫ్ట్ ఇచ్చి చాకుతో దాడి

- దేవరాపల్లిలో యువకుడికి గాయాలు
- నగదు, సెల్‌ఫోన్‌తో గుర్తు తెలియని వ్యక్తుల పరారీ



కె. కోటపాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీను

దేవరాపల్లి: తెల్లవారుజామున బస్సులు, ఇతర వాహనాలు లేకపోవడంతో లిఫ్ట్ అడిగిన పాపానికి ఓ యువకుడిపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు చాకుతో దాడి చేశారు. అతడి వద్ద రూ.5 వేలతో పర్సును, సెల్‌ఫోన్‌ను ఎత్తుకుపోయారు. దేవరాపల్లిలో ఆదివారం వేకువ జామున 5 గంటల ప్రాంతంలో ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా ఎస్. కోట మండలం వెంకటరమణపేటకు చెందిన జవ్వాది శ్రీను(32) విశాఖ నుంచి దేవరాపల్లిలో తన అత్తవారింటికి శనివారం రాత్రి బయలుదేరి వెళ్లాడు. కొత్తవలస వరకు బస్సులోను, అక్కడ నుంచి వావిలపాడు జంక్షన్ వరకు క్వారీ లారీ మీద చేరుకున్నాడు. అక్కడ ఏ వాహనం దొరక్కపోవడంతో దేవరాపల్లికి నడుచుకుంటూ బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై దేవరాపల్లి వైపు వస్తుండగా, వారిని ఆపి తీసుకెళ్లాలని కోరాడు. అతడిని ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని దేవరాపల్లిలో దించకుండా శారదా నది వంతెన వైపు నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ అతడి జేబులో పర్సు, సెల్‌ఫోను ఇవ్వకపోతే చంపేస్తామంటూ చాకుతో బెదిరించారు. దీంతో భయపడిన శ్రీను రూ.5 వేలతో పర్సు ఇచ్చేసి, సెల్‌ఫోన్ ఇవ్వడానికి నిరాకరించాడు. దీంతో రెచ్చిపోయిన యువకులు అతనిపై చాకుతో దాడికి దిగారు. ఈ దాడిలో శ్రీను చేతి వేళ్లు, తలతోపాటు శరీరంలో పలు చోట్ల విచక్షణా రహితంగా తీవ్రంగా గాయపర్చారు. దాంతో సెల్‌ఫోను వారికిచ్చేసి ప్రాణభయంతో పరుగులు తీశాడు. అయినా అతడిని వెంబడించడంతో వంతెన దగ్గరలో ఇటుక బట్టీలు వద్దకు చేరుకుని, పెద్దగా కేకలు వేయడంతో అక్కడ వారంతా నిద్రలేచి చూసేసరికి దాడికి పాల్పడిన యువకులు పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన శ్రీనును దేవరాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కె. కోటపాడు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ డి. నాగేంద్ర కేసు నమోదు చేశారు. ఈ దాడికి పాల్పడిన వారి గురించి ఆరా తీస్తున్నామన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



బుడ్డేపు వెంకటేష్ (ఫైల్)

భోగాపురం: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం మండలంలోని సవరవిల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని సంతకవిటి మండలం సిరిపురం గ్రామానికి చెందిన బుడ్డెపు వెంకటేష్‌కు (33) రెండు సంవత్సరాల కిందట విశాఖపట్నం జిల్లా పెద్దవాల్తేరు గ్రామానికి చెందిన శ్రీలేఖతో వివాహం జరిగింది. ఉద్యోగరిత్యా భార్యాభర్తలిద్దరూ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. అయితే వెంకటేష్ బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతుండడంతో పది రోజుల కిందట విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. ఆదివారం కుట్లు విప్పించి కారులో సిరిపురం తీసుకువస్తుండగా.. సవరవిల్లి వద్దకు వచ్చేసరికి వెంకటేష్ బహిర్భూకి వెళ్తానని చెప్పడంతో డ్రైవర్ కారు పక్కకు తీసి ఆపాడు. ఈ క్రమంలో వెంకటేష్ రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని తండ్రి సహదేవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



మృతి చెందిన చింతాడ కుమారి

పార్వతీపురం టౌన్: చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దినకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కృష్ణపల్లి పంచాయతీ పార్వతీనగర్‌కు చెందిన చింతాడ కుమారి (42) భర్త చనిపోవడంతో కుమారుడుతో కలిసి కొన్నేళ్లుగా తల్లి వద్ద ఉంటోంది. అయితే తల్లితో ఎప్పటికప్పుడు తగవులవుతుంటాయి. ఈక్రమంలో శుక్రవారం కూడా ఇద్దరి మధ్య గొడవ జరగడంతో కుమారి ఇంటిలో ఉన్న ఫినాయిల్ తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి కుమారిని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కుమారి ఆదివారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.